

# కల్పనలో నిజం

కల్పన నిజం కాదు; నిజం కల్పన కాదు. కల్పనకు ఊహాశక్తి ఆధారం. ఊహ అనుభవ జనితం. కనుక కల్పనలో నిజం ఉన్నది. నిజమైనా చూచేవారినిబట్టి మారుతుంది. ఊహాశక్తి తోడవుతుంది. కనుక నిజంలో కల్పన ఉన్నది.

కల్పన మధురమా? నిజమే మధురమా? లేక దేనిలో మాధుర్యం ఉన్నది? దేనిలో మాధుర్యం అధికం ? ఈ ప్రశ్నలకు సమాధానాలు సులభంగా లభ్యం కావు.

ఒకటి మాత్రం నిజం. వాస్తవాన్ని పోలిఉన్నప్పుడే కల్పన అవుతుంది. ఆకర్షిస్తుంది. కాని కల్పన కాదని పిస్తుంది. నిజమై కూర్చుంటుంది. నిజమూ అంతే. కల్పనకు సన్నిహితంగా ఉంటుంది. నిజం కాదనే భ్రమ కలిగిస్తుంది. ఏమైనా రెంటినీ కాదనడం కష్టమే. లేకపోతే జీవితంలో స్వారస్యం ఉండదు.

మా నరసింహం తన అనుభవం చెప్పాడు. మేము నమ్మ లేకపోయాము. నిజమే నన్నాడు మా నరసింహం. మేము కాదన్నాము. నా మనసు కల్పనా నిజాల నిజానిజాలపై లగ్నమైంది.

మెరపు మెరసినట్లు అయినది. వెనుక మద్రాసులో విన్న సంభాషణ తిరిగి వీనులకు విననైనది...అతడు యువకుడు. ఆమె యువతి. ఇరువురూ సౌందర్యసంపన్నులు. అతడు ఆమెను ప్రేమించాడు. ఆమె ఆతని ప్రేమించింది. వివాహం ప్రేమను పోషించినది.

అది నవ వసంతకాలం. వెన్నెల రాత్రి. ప్రశాంత సముద్రతీరప్రాంతం. మలయ పవనుని చల్లని పిల్ల తెమ్మెరలు వీస్తూ ఉన్న మధుర సమయం.

జనం ఉన్నా ప్రేయసీ ప్రియులకు తమదే లోకం. మనసు ప్రేమను పట్టుకొని ఊగులాడవలసిన స్థితి. కాని ఆ వినిపించే దేమిటి?

"ప్రేయసీ శాంతా, రేపు సినీమాకి పోదామా? 'కొత్త కోడళ్ళు' బాగా ఉందని మా ఆఫీసులో వాళ్ళు అన్నారు......"

"ప్రియా రఘూ, రేపు ప్రొద్దుట మీరు ఆఫీసుకు వెళ్ళడానికి డబ్బులు లేవు కదా? పొరుగింటి పుల్లమ్మగారిని అడిగితే నాలుగు అణాలు ఇస్తానన్నారు. ప్రొద్దుటే తీసుకొని ఇస్తాను. అది ఆఫీసుకు వెళ్ళడానికి, తిరిగి రావడానికి సరి పోతుంది. మరి ఫలహారం మాట ఏమిటి? పోనీ ఏమైనా చేసి ఇద్దామంటే ఇంట్లో సరకులు అయిపోయాయి. అలాంటప్పుడు సినీమా కుండానా?"

"ఎవరి దగ్గర అయినా రెండు రూపాయలు అప్పు చేస్తాను. సినీమా చూద్దాము. చాలాకాలంగా నీతో కలిసి వెళ్ళాలని సరదాగా ఉంది. కాదనకు ప్రియా."

"ఇంకో వారం రోజులు గడిస్తే గాని జీతం రాదు. రెండు రూపాయలు ఉంటే మీరు నిశ్చింతగా ఆఫీసుకి వెళ్ళి రావచ్చు. నాకూ బెడద తీరుతుంది. రోజూ తెల్లవారి లేచి పుల్లమ్మగారిని, వెంకమ్మగారిని దేవురించడం తల వంపుగా ఉంది. లేకపోతే, నాకు మాత్రం సినీమా చూడడం ఇష్టం లేదా, నాథా......"

చంద్రుడు సిగ్గుపడి మేఘాల మాటున ముఖం దాచు కొన్నాడు. మలయ పవనుడు నిశ్చేష్టుడయ్యాడు. వసంతం ఒక్క క్షణంలో చల్లబడిపోయింది. చినుకులు ప్రారంభమయ్యాయి. నేను పారిపోయాను...

తిరిగి ప్రకృతిలో పడ్డాను. కాని సమస్య నిలిచిపోయింది. ఏది నిజం? ఏది కల్పన?

మా నరసింహం నివేదించిన గాథ మననం చేసు కొంటున్నాను.

*   *   *

"ఈ వేళ పత్రికలలో మధుర కవి మాణిక్యరావు మృతి గురించిన వార్త చూచారా?" మా నరసింహం ప్రశ్న.

చూడకేమి? చూచాము.

పత్రికలు ప్రచురించే ఇతర వార్తలు చదివినా చదవక పోయినా తెలుగువారి మరణవార్తలు, అందులోనూ తెలుగు కవుల, రచయితల, చిత్రకారుల మరణవార్తలు మేము విధిగా చదువుతాము. దానికి కారణం లేకపోలేదు.

మరణించిన తరువాతనే తెలుగుకవుల, రచయితల, చిత్రకారుల పేర్లు చలామణీ కావడం. మన్ననా అప్పుడే. బ్రతికి ఉండగా వారిని గురించిన ప్రసక్తి పత్రికలలో ఉండదు. కనుకనే ఈ వర్గం వారిలో జీవించి ఉండగా ఘనకార్యాలు చేసినవారిని గురించి తెలుసుకొనడానికి ఒక్కటే మార్గం. వారు చనిపోయేవరకు వేచి వుండడమే.

మేము విధిగా మరణ వార్తలు చదవడానికి అదే కారణం.

మరణ వార్తలలోనూ ఒక్కొక్కప్పుడు వారి ఘనత తెలియదు. మరి కొంతకాలం వేచి ఉండడం అవసరం. అప్పుడు పత్రికలు ఎలాగూ వారిని గురించిన ప్రత్యేక వ్యాసాలు ప్రచురించగలవు. వాటిలో వారి ఘనత తప్పక ద్యోతకం అవుతుంది.

"మాణిక్యరావు చాలా గొప్పకవి. తెలుసునా?" నరసింహం గద్దించాడు.

తెలుసునని తలలు వూపాము.

నిజానికి ఆయన గొప్ప కవి కావడం మాట అలుంచి అసలు కవి అయిన సంగతి కూడా మాకు-అంటే నరసింహం మిత్ర బృందానికి-తెలియదు. మేము ఆయన రచనలు ఏవీూ చదువలేదు. అసలు మేము ఎవరి రచనలూ చదవము. చదివినా కవిత్వం మాకు కొరుకుపడని కొయ్య.

కేవలం మరణ వార్తలలో ఉన్నది అంగీకరించడం మాత్రమే మాకు తెలుసు.

నరసింహామే వెనుక మాణిక్యరావు గొప్ప కవి అని చాలాసార్లు చెప్పగా విన్నాము. అయిఉండవచ్చు. మాకు అది చాలు.

ఇప్పుడు నరసింహంమీాది గౌరవం కొలదీ అంతటి గొప్ప విషయం మాకు తెలుసునని అంగీకరించాము. నరసింహం శాంతించాడు.

మాకు మరొకటి బాగా తెలుసు. మాణిక్యరావు గొప్ప కవి అయిన సంగతి మాకు తెలియదంటే మా నరసింహం ఉగ్రరూపం దాల్చి ఉండేవాడు. మా అజ్ఞానాన్ని పారద్రోల డానికి కంకణం కట్టుకొని ఉండేవాడు. ఆ మహాకవి గురించి ఉపన్యసించి ఉండేవాడు. దానితో మాణిక్యరావు మృతి వెనుక దాగిఉన్న కథ మాకు తెలియడానికి మార్గం కట్టుపడి ఉండేది. మాకు కథలమీాద ఉన్న ఆపేక్ష కవులమీాద లేదు. కనుకనే తెలుసునని తలలు ఆడించాము.

"చావు కోరినా రాదు. ఎవరికైనా అంతే. వస్తుందేమో అని భయపడి రాకుండా చేయడానికి నానాపాట్లూ పడ్డప్పుడు రానే వస్తుంది."

నరసింహం సిద్ధాంతీకరించాడు.

నిజమే. లేకపోతే మా కోరిక ప్రకారం మా శత్రువులలో కొందరు అయినా తప్పక ఏనాడో గతించి ఉండేవారు. కనీసం మా ప్రాణం-సమష్టి ప్రాణం కొరికి తింటూఉన్న కొంటె శివరావు (మా మాజీ మిత్రుడు, ప్రస్తుత ప్రథమ శత్రువు) అయినా ఎప్పుడో విగత జీవుడై స్వర్గస్థుడై ఉండవలసినది. (మా శత్రువులకు కూడా మేము నరకవాసం కోరలేదు) కాని వారందరూ ఇంకా సజీవంగానే ఉన్నారు. జీవించి ఉండాలని మేము కోరుకొన్నా, మా మిత్రుడే ఇటీవల మరణించాడు.

ఈ సంగతే ముచ్చటించాము. నరసింహం నవ్వాడు.

"ఇతరులు కోరడం కాదురా. ఏ మనిషికి ఆ మనిషి కోరుకొనడం మాట చెప్పాను. అది సరే. ఈ మధురకవి సంగతిచెబుతాను. వినండి" అంటూ ఉపక్రమించాడు.

"ఒకప్పుడు నేనూ, మాణిక్యరావూ కలిసి పనిచేశాము.

"మాణిక్యరావుకు జీతం చాలా తక్కువ. కుటుంబమేమో చాలా పెద్దది. సాలీనా అందరితోబాటూ అతని జీతమూ కొంచెమో గొప్పో పెరిగేది. కాని ఖర్చు అంతకన్నా పెరిగేది. మార్పల్లా-పరిస్థితి మరింత విషమించడం.

"మాణిక్యరావుకు అప్పులు పెరిగిపోయాయి. చచ్చినా తీరవు. చస్తే వచ్చే డబ్బుతో పదోవంతు అయినా తీరు

తుందో తీరదో! కాని చస్తే ఒక లాభం. అప్పుల బాధ కుటుంబానికి ఉండదు. ఏమంటే అప్పు ఇచ్చినవాళ్ళు అందరూ తోడి పనివారే. అందులోనూ మిత్రులు. జీవించి ఉండగా తీర్చలేడని తెలిసే ఇచ్చారు. చస్తే పీడించరు.

"కాని, మాణిక్యరావుకు అదే బాధ అయింది. చచ్చినా తీర్చలేని ఋణాల అవమానం భరించలేకపోయాడు. దానితో బ్రతుకుమీద ఆసక్తి చచ్చిపోయింది.

"పిల్లల్లో మోహన్ పెద్దవాడు. బి. ఏ. పూర్తి చేశాడు. ట్రెయినింగు అవుతున్నాడు. తరువాత ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశిస్తాడు. కుటుంబాన్ని పోషిస్తాడు. అందుచేత ఆ చింత మాణిక్యరావుకు లేదు.

* * *

"తాను చస్తే వచ్చేదానితో తనవారు కొత్త జీవితం ప్రారంభించగలుగుతారు. తాను బ్రతికి ఉండగా బాధించే ఋణాలకు చచ్చిన తరువాత బాధించగలిగిన శక్తి లేదని అతనికి తెలుసు.

"కనుక ఋణాల అవమానం భరించలేక చచ్చిపోదామనుకొన్నాడు...

"ప్రతి ఏడాదీ ఒక నెల సెలవు తీసుకోవడం మాకందరికీ పరిపాటి. ఆ ఏడాది మామూలుగానే మాణిక్యరావు సెలవు తీసుకొన్నాడు. అంతకు ముందునించీ జబ్బుగాఉన్నాడు. ఆ సంగతి మాకు తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. సెలవు తీసుకొని ఎవరితోనూ చెప్పకుండా కుటుంబంతో సహా వూరు విడిచి వెళ్ళిపోయాడు.

"పెద్దవాడు మాత్రం చదువుకోసం వూళ్ళోనే ఉండి పోయాడు.

"మేము తన సంగతి మరచిపోతా మనుకొన్నాడు మాణిక్యరావు. వచ్చిన జబ్బు కూడా చెడ్డదే. ముదిరేవరకు కప్పిపెట్టితే వైద్యులవల్ల కాదు. హాయిగా చచ్చిపోవచ్చు ననుకొన్నాడు. కనుకనే ఆఫీసులో లాగానే ఇంట్లోనూ ఎవరికీ తెలియనిచ్చాడు కాదు.

"మేమూ మరిచిపోయి ఉండేవాళ్ళం. అనుమానం లేదు. దగ్గరివాడే మిత్రుడు. ఇది లోకం రివాజు. మాకూ విహితం. మరిచేపోయాము. కాని మేము మాణిక్యరావును జ్ఞప్తికి తెచ్చుకొనవలసిన అవసరం వచ్చింది. అతన్ని జరూరుగా కలుసుకొనవలసిన అవసరమూ వచ్చింది.

"మా ఆఫీసులో, ముఖ్యంగా మా శాఖలోని మాణిక్య రావు మిత్ర బృందం సహాయం అర్థించాడు ఒకాయన. చేశాము, ఆనందించాడు. మాకు ప్రతిఫలం ముట్టచెప్తాతా నన్నాడు. నా కో ఆలోచన తట్టింది.

"మావల్ల సహాయం పొందిన ఆసామీ పుస్తక ప్రచురణ సంస్థ యజమాని. మాణిక్యరావు చాలానే రచనలు చేశాడు. అవి పత్రికలలో ప్రచురితమయ్యాయి. గ్రంథ రూపంలో మాత్రం వెలువడలేదు. అందుచేత మాణిక్యరావు రచనలు గ్రంథరూపంలో వెలువరించమని ఆయనను కోరితే బాగా ఉంటుందని మిత్రులతో చెప్పాను. మాణిక్యరావుకు రెండు విధాల సహాయం జరుగుతుంది. రచనలు గ్రంథ రూపంలో వెలువడతాయి. కొంత లబ్ధి ఉంటుంది.

"ఇది మాకూ ఉపకారమే. ఆ పెద్దమనిషి కొంచెమో గొప్పో ఇస్తే పుచ్చుకొంటాము. అభ్యంతరమేమీ లేదు. దాని వల్ల మాకు సహాయం జరుగదు. పైగా మరి కొన్నాళ్ళకు దానిని ఎలాగూ వడ్డీతో సహా మాణిక్యరావుకు సమర్పించవలసినదే. అది సరాసరి మాణిక్యరావుకే ముట్ట చెప్పిస్తే కొన్నాళ్ళవరకు మాకు ఒత్తిడి ఉండదు. తరువాత అంటారా 'నందో రాజా భవిష్యతి'... ఇదీ నా ఆలోచన.

"మిత్రులు మహా బాగన్నారు. పుస్తక ప్రచురణ సంస్థ యజమాని సరే నన్నాడు. ఆయనకు ఏ రాయి అయినా ఒకటే.

"అయితే ఒక ఇబ్బంది వచ్చింది. ఆయన కొలది రోజుల్లో విదేశ యాత్రకు వెళ్లుతున్నాడు. తిరిగి రావడానికి చాలాకాలం పట్టుతుంది. కనుక 'వెంటనే అగ్రిమెంటుమీద మీ మిత్రునిచేత సంతకం చేయించి ఇవ్వండి. రచనలు కూడా ఇవ్వండి. డబ్బు ఇచ్చి, ప్రచురణకు ఏర్పాట్లు చేసిపోతాను' అన్నాడాయన.

"ఈ ఆలోచన నాది గనుక మాణిక్యరావును కలుసుకొని ఇదంతా పూర్తిచేసే బాధ్యత నాదేనని మిత్రులు నిర్ణయించారు. గత్యంతరం లేకపోయింది. సెలవు తీసుకొని బయలుదేరాను.

"మోహన్‌ను అడిగాను. అడ్రసు చెప్పడానికి అబ్బాయి తటపటాయించాడు. నాకు అర్థం కాలేదు. గట్టిగా అడిగేసరికి కాదనడానికి భయపడి ఇచ్చాడు.

“తరువాత తెలుసుకొన్నాను. ఎవరు అడిగినా అడ్రసు చెప్పవద్దన్నాడు తండ్రి. అప్పులవాళ్ళను ఉద్దేశించి ఆయన నా విధంగా చెప్పి ఉంటాడే కాని ఆయనతో కలిసి ఒకే ఆఫీసులో పనిచేసేవారిని, అందులోనూ మిత్రులను ఉద్దేశించి కాదని ఆ పిల్లవాడు సరిపెట్టుకొన్నాడట.

“ఇంతా చేసి మాణిక్యరావు పక్కవూళ్ళోనే ఉన్నాడు. డబ్బు లేనివాడు దూరంగా పారిపోదా మనుకొన్నా సాధ్యం కాదనడానికి ఇదే తార్కాణ మనుకొన్నాను. పక్కవూళ్ళో ఉన్న ఒకానొక మిత్రుడు తల్లిని తీసుకొని కాశీ యాత్రకు వెళ్లుతూ మాణిక్యరావు ఉండడానికి ఆస్కారం ఇచ్చాడు. లేకపోతే అది సాధ్యం కాదు. అక్కడికి వెళ్ళాను.

“అక్కడి పరిస్థితి బీభత్సంగా ఉంది. మాణిక్యరావు భార్య లక్షుమ్మగారు నన్ను చూస్తూ వలవల ఏడ్చింది. నేను కంగారు పడ్డాను.

“ఆమె చెప్పినదాన్నిబట్టి నేను తెలుసుకొన్నది ఇది:

“మాణిక్యరావుకు నిజంగానే రోగం ముదిరింది. ఒక కోరిక ఈడేరింది. అతని పరిస్థితి భార్య గుర్తించింది. అది బొత్తుగా కుగ్రామం. వైద్యుడు అయినా లేడు. గచ్చాకు పుచ్చాకు నూరి ఇస్తే కుదిరే జబ్బు కాదు. అయినా చేయ గలిగినదంతా చేసింది. ప్రయోజనం శూన్యం. ఇంకో మూల, చేతిలో ఉన్న కొద్ది డబ్బూ అయిపోయింది. మింగడానికి మెతుకులు కూడా లేవు. పిల్లలు మలమల మాడే అవస్థ వచ్చింది. అక్కడికీ ఆమె ఎలాగో ముష్టి ఎత్తి ఇంత ఉడకబెట్టి పిల్లలకు వేస్తూ ఉంది. ఊరు విడిచి పోదామంటే అతడు

ఉలకడు, పలకడు. పోనీ, స్నేహితులు ఎవరికి అయినా వ్రాయండి అంటే, ఆ మాట ఎత్తవద్దని మండిపడుతున్నాడు. ఎవరితో అయినా చెప్పుకొని ఏడుద్దామంటే ఆప్తులు లేరు. ఇదీ పరిస్థితి.

"నన్ను చూస్తూనే మాణిక్యరావు మండిపడ్డాడు. అసలు నాతో మాట్లాడ నన్నాడు. నా సహాయమేమీ అక్కర లేదన్నాడు. నానా హంగామా చేశాడు. నేను శకునిలా తన మహా ప్రస్థానానికి అడ్డు తగులుతానని భయపడ్డాడు. అతని ధోరణి చూచి, ఆడిన మాటలు విని సంగతి అంతా అర్థం చేసుకొన్నాను.

"మిత్రులకు తన సంగతి తెలిస్తే అడ్డుపడి బ్రతికిస్తారని మాణిక్యరావు భయం. దానిలో నిజం లేకపోలేదు. మేము అడ్డుపడి ఉండేవాళ్ళం. ఫలితం మాత్రం దైవాధీనం.

"మనిషికి చాలానే అప్పు పెట్టాము. జీవించిఉంటే ఏనాటికి అయినా మా అప్పులు తీర్చవచ్చు. జీవించాలనే కోరుతున్నాము. చస్తే అతనితోనే మా అప్పులు సరి.

"అయితే అది పూర్తిగా నిజం కాదు. మాణిక్యరావు మంచివాడు. స్నేహ పాత్రుడు. కపటం ఎరుగడు. మనసు ఇచ్చే మనిషి. అందుచేతనే అతనితో చెలిమి చేశాము. ప్రేమించాము. దురదృష్టవశాత్తూ చిక్కులలో పడ్డాడు. కనుక సహాయం చేశాము. మేమైనా ధనికులం కాము. ఓపినంత మట్టుకే చేశాము. దానం ఇవ్వడం అవమానం చేయడం. అప్పుగా ఇచ్చాము. గౌరవం చూపాము. తీరిస్తే ఆనందిస్తాము.

తీర్చుకపోతే చింతించను. ఈ సత్యాన్ని మాణిక్యరావు తెలుసుకోలేకపోయాడు. మేము చెప్పలేకపోయాము.

"మాణిక్యరావుమనసు మరలించి ఆ వూరినుంచి తీసుకొని రావడానికి నాకు మూడు రోజులు పట్టింది. అయినా ఎలాగో సాధించగలిగాను. గట్టున పడ్డామని సంతోషించాను.

"అక్కడి పరిస్థితి నేను చెప్పగా విని మిత్రులు ఖిన్నులయ్యారు. మాణిక్యరావు గండం గడిచినందుకు ఆనందించారు.

"కాని, తిరిగి వచ్చినప్పటినుంచీ మాణిక్యరావు మాతో పూర్వంలా మాట్లాడడం మానివేశాడు. క్రమంగా మాతో కక్ష కూడా పెంచుకొన్నాడు.

"పుస్తకం ప్రచురించడంతో మాణిక్యరావు అదృష్టం మళ్ళింది. పుస్తకాలమీద పుస్తకాలు ఒకటికి రెండుసార్లు ప్రచురితమయ్యాయి. డబ్బూ వచ్చింది. పేరూ వచ్చింది. రొట్టె విరిగి నేతిలో పడ్డట్లు సినిమాల్లోకి ఎక్కాడు. ఉద్యోగం విరమించాడు. డబ్బు పుష్కలంగా ఆర్జించాడు. అప్పులన్నీ—ఆఖరికి మా అప్పులుకూడా—తీర్చివేశాడు.

"తరువాత నేనూ ఆ వూరు విడిచిపెట్టాను.

"ఇటీవల మాణిక్యరావు గురించి కర్ణాకర్ణిగా తెలిసినది ఇది:

"మాణిక్యరావుకు విరక్తిపోయి రక్తి కలిగింది. ప్రాణం మీద తీపి అధికమైంది. భయమూ పెరిగింది.

"కాలులో మేకు గుచ్చుకొంటే ఉపేక్ష చేయక పోయినా సెప్టిక్ అయింది. ఆస్పత్రిలో చేరాడు. నలభై రోజులు ఆస్పత్రిలో గడిపాడు. మొదట పాదం తెగగొట్టారు.

తరువాత మోకాలువరకు తీసేశారు. చివరికి తొడవరకు కోసేశారు.

"పూర్వం నాస్తికుడు అయిన మనిషి మృత్యుంజయ జపం చేశాడు. తిరుపతి వేంకటేశ్వరస్వామికి మొక్కుకొన్నాడు. నానా దేవతలను ప్రార్థించాడు. భార్యచేత, పిల్లలచేత కూడా మొక్కించాడు. పూజలు చేయించాడు. తన వాళ్లు అందరిని రప్పించి ధైర్యం చెప్పించుకొన్నాడు. మృత్యుదేవత కాళ్ళా వేళ్ళా పడి కొన్నాళ్ళు అయినా బ్రతకనివ్వమని ప్రాధేయపడ్డాడు.

"ఏమి చేసినా ప్రయోజనం లేకపోయింది. అతని జీవితం...

"మేము గట్టిగా విడిచిన నిట్టూర్పు నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ అనంతాకాశంలో లీనమైంది."

—